
శనివారం 1 జులై 2017

# పట్టిసీమ ద్వారా డెల్టాకు సాగునీరు

**కౌతవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే :** శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతల ప్రాజెక్టులలో నీటి నిల్వలు లేకున్నా సీఎం చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు కృష్ణా డెల్టాకు పట్టిసీమ ద్వారా సాగునీరు ఇస్తున్నారని పెడన ఎమ్మెల్యే కాగిత వెంకట్రావ్ పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని కౌతవరం లాకుల వద్ద క్యాంప్‌బెల్ కాల్వకు సాగునీటి విడుదలను ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని నిర్వహించారు. పుల్లేరు ద్వారా సాగునీరు వారం రోజుల కిందట విడుదలైనా పోల్‌రాజ్ కాల్వలకు నీటిని విడుదల చేశారు కానీ, పనులు నిర్వహిస్తున్నందున క్యాంప్‌బెల్, బంటుమిల్లి కాల్వలకు విడుదల చేయలేదు. దీంతో శుక్రవారం ఎమ్మెల్యే కాగిత వచ్చి లాకు షట్టర్లు ఎత్తి నీటిని విడుదల చేసి పూలు వేసి పూజలు నిర్వహించారు. ఎస్‌ఈ శ్రీనివాసమూర్తి, డీఈఈ బాబు, ఏఈఈలు సిద్దార్థ, రాజేశ్వరి, లాకు సూపరింటెండెంట్ ఉదయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



**నీటికి పూలేసి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కాగిత, ఎస్ఈ శ్రీనివాసమూర్తి**

బుధవారం 5 జులై 2017

# ట్రాన్స్‌కో ఏఈఈ బదిలీ

**కౌతవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే:** మండలంలోని కౌతవరం విద్యుత్తు ఉప కేంద్రం ఏఈఈ సురేశ్ బదిలీపై తిరుపతి వెళ్లారు. ఆయన స్థానంలో ఇక్కడ ఎవరూ రాలేదు. దీంతో ఈ స్థానం ఖాళీగా ఉంది. ప్రస్తుతం ముదినేపల్లి ఏఈఈకు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించినట్లు, వినియోగదారులు ఏమైనా సమస్యలుంటే ముదినేపల్లి ఏఈఈ సూర్యప్రకాశ్ 9440812171కు చరవాణి నంబరుకు తెలియపరచాలని కోరారు.

శనివారం 8 జులై 2017

# ఉర్దూ పాఠశాలకు బల్లల అందజేత



హెచ్‌ఎం ఇర్ఫానుల్లాకు టేబుల్స్ అందజేస్తున్న షేక్ అలీం

**కౌతవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే :** మండలంలోని కౌతవరం చెక్‌పోస్టు ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలకు శుక్రవారం ఉపాధ్యాయుల విధులకు వీలుగా రెండు బల్లలను అందజేశారు. మానవహక్కుల సంఘం నియోజకవర్గ డైరెక్టర్ షేక్ అలీం ₹ 7 వేల విలువైన రెండు బల్లలు హెచ్‌ఎం మహ్మాద్ ఇర్ఫానుల్లాకు అందజేశారు. తన తల్లి దివంగత షేక్ హబీబున్నీ పేరిట వీటిని అలీం అందజేయగా హెచ్‌ఎం అభినందించారు. పాఠశాల ఆవరణను భరంతు చేయిస్తానని, ఫ్లోరింగ్ చేయిస్తానని ఈ సందర్భంగా అలీం హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అబ్దుల్ లతీఫ్, సురయాసుల్తానా, ఖుద్దూస్, రహమాన్, రఫియా తదితరులు పాల్గొన్నారు.

# రేపు గురుపౌర్ణమి వేడుకలు



శ్రీషిర్డీసాయి ఆలయం

**కౌతవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే :** మండలంలోని కౌతవరం శ్రీ షిర్డీసాయి ఆలయంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదయం బాబాకు కాకడ హారతి, పంచామృత అభిషేకాలు, విశేష అలంకరణ, జ్యోతి ప్రజ్వలన, పూలాభిషేకం, గణపతిపూజ, మండపారాధన, లక్ష్మీగణపతి దత్తసాయి హోమం, మహాపూర్ణాహుతి, కుంభహారతి, మధ్యాహ్న హారతి అనంతరం దివంగత తూము సూర్యనారాయణ, సుబ్బారావు కుటుంబీకుల ఆర్థిక వితరణతో అన్నసమారాధనలు నిర్వహించనున్నట్లు ఆలయ మహిళా నిర్వాహకులు వెల్లడించారు. రాత్రికి ఆలయం వద్ద రెడ్డిపాలెం ఆదర్శ నాట్యకళా మండలి వారిచే ఎంపీటీసీ సభ్యుడు బెల్లంకొండ ఏడుకొండలు ఆధ్వర్యంలో శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి జీవిత చరిత్ర నాటకాన్ని ప్రదర్శించనున్నారు.

సోమవారం 10 జులై 2017

**కౌతవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే:** మండలంలోని కౌతవరం షిర్డీసాయి ఆలయంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. పూర్తిగా మహిళలచే నిర్మించి, నిర్వహిస్తున్న ఆలయంగా ఇది జిల్లాలో ప్రసిద్ధి చెందింది. అన్నసమారాధనలు నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీఉపాధ్యక్షురాలు శాయన పుష్పావతి తదితరులు పాల్గొన్నారు. రాత్రికి ఆలయం వద్ద రెడ్డిపాలెం ఆదర్శ నాట్యకళామండలి వారిచే ప్రదర్శించిన శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి జీవిత చరిత్ర నాటకం ఆకట్టుకుంది.



బాబాకు పూజాదికాలు చేస్తున్న ఉభయదాతలు



కొత్తవరంలో గురుపౌర్ణమి పూజల్లో పాల్గొన్న
బీజేపీ నాయులు, బాలు దంపతులు



కొత్తవరంలో పూజలు చేసిన వహీద్, బాలు

**మంగళవారం 11 జులై 2017**

# కౌతవరంలో బాబాకు విభూతి అభిషేకం



బాబాకు విభూతి అభిషేకం చేస్తున్న భక్తులు

**కౌతవరం(గుడ్లవల్లేరు), న్యూస్ టుడే :** మండలంలోని కౌతవరం షిర్డీసాయి ఆలయంలో ఆదివారం రాత్రి బాబాకు విభూతి అభిషేకాన్ని కనుల పండుగా నిర్వహించారు. గురుపౌర్ణమిని పురస్కరించుకొని చేపట్టిన ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగంగా ఆలయ సేవాకమిటీ ఛైర్మన్ కానూరి బాలకృష్ణమోహన్-రాధిక దంపతులు, ఆలయ కమిటీ సభ్యురాలు వడ్లమూడి తాండవ కృష్ణ-శైలజ దంపతులు బాబాకు విభూతితో అభిషేకం నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు, రాత్రికి పల్లకీ సేవ, ఊరేగింపు నిర్వహించారు. ఏర్పాట్లను వడ్లమూడి పద్మజ, పడమట సుజాత, కళ్లేపల్లి సుధారాణి, రంగనాయకమ్మ, సీతామహాలక్ష్మి తదితరులు పర్యవేక్షించారు.

**గురువారం 13 జులై 2017**

# ప్రారంభమైన సార్వా వరినాట్లు



నాట్లు వేస్తున్న మహిళలు

**కౌతవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే:** మండలంలోని పలు గ్రామాల్లో సార్వా వరినాట్లు ప్రారంభమయ్యాయి. మండలంలోని కౌతవరం వద్ద పొలాల్లో మహిళలు బుధవారం వరి నాట్లు వేస్తుండటంతో సందడి నెలకొంది. కౌతవరం 1వవార్డు నుంచి విద్యుత్తు సబ్‌స్టేషన్ వరకు అటూ ఇటూ పొలాల్లో మహిళా కూలీలు నాట్లు వేస్తూ కన్పించారు.

శుక్రవారం 14 జులై 2017

# కాల్వలకు తగ్గిన నీటి మట్టం



పుల్లేరులో నీటి మట్టం



కౌతవరం లాకుల వద్దకు చేరిన నీరు



పోల్‌రాజ్ కాల్వలో నీటి ప్రవాహం

**కౌతవరం (గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే:** మండలంలోని కౌతవరం ప్రధాన లాకులకు సాగునీటి సరఫరా తగ్గింది. దీంతో అధికారులు బంటుమిల్లి కాల్వకు నీటి సరఫరాను తగ్గించారు. పుల్లేరు కాల్వ ద్వారా కౌతవరం లాకులకు 700 క్యూసెక్కుల నీరు మాత్రమే రావడంతో అధికారులు పోల్‌రాజ్ కాల్వకు 325, క్యాంప్‌బెల్ కాల్వకు 300 క్యూసెక్కులు ఇచ్చి బంటుమిల్లి కాల్వకు 55 క్యూసెక్కుల నీటినే విడుదల చేశారు. దీంతో బంటుమిల్లి కాల్వలో నీటి పారుదల తగ్గిపోయింది. దీనిపై లాకు సూపరింటెండెంట్ ఉదయభాస్కర్ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల నేపథ్యంలో బంటుమిల్లి కాల్వకు నీటి సరఫరా తగ్గించామని, మిగిలిన రెండు కాల్వలకు నీటిని ఇస్తున్నట్లు వివరించారు.



చెక్కులు అందజేస్తున్న హరిగోపాల్-పుష్పావతి దంపతులు

# పేద విద్యార్థుల చదువులకు రూ.60వేల వితరణ

**కౌతవరం (గుడ్లవల్లేరు):** మండలంలోని కౌతవరం శ్రీషిర్డీ సాయి ఆలయంలో గురువారం పేద విద్యార్థులకు రూ.60 వేల నగదు చెక్కులను దాతలు అందజేశారు. ఆలయంలో గత కొన్నేళ్లుగా విద్యాదీపం పథకం పేరిట గుర్తించి పేద విద్యార్థులకు ఉన్నత చదువులకు అయ్యే మొత్తం ఖర్చును భరిస్తుంటారు. దీనికి దాతలు తోడ్పాటు అందిస్తుంటారు. దీనిలో భాగంగా హైదరాబాద్‌కు చెందిన జేబీఐటీ ఇంజినీరింగ్ కళాశాలల డైరెక్టర్ దాసరి హరిగోపాల్-పుష్పావతి దంపతులు పాలిటెక్నిక్, ఇంజినీరింగ్ చదువుతున్న ఇద్దరు పేద విద్యార్థినుల చదువులు, ఫీజుల నిమిత్తం రూ.60వేల నగదు చెక్కులను ఆలయ మహిళా నిర్వాహకులకు అందజేశారు.

శనివారం 15 జూలై 2017

# బీటీ రహదారులకు మహర్దశ

## ☛ ఒకేసారి 8 రోడ్లకు మరమ్మతులు ☛ ₹ 29.21 లక్షల విడుదల

**గుడ్లవల్లేరు, న్యూస్‌టుడే**

మండలంలోని తారు రహదారులకు మహర్దశ పట్టింది. ఒకేసారి మండలంలోని అన్ని బీటీ రహదారుల మరమ్మతులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. మొత్తం ఎనిమిది గ్రామపంచాయతీల్లోని ఎనిమిది రహదారులకు 19.47 కి.మీ మేర మరమ్మతులకు ₹ 29.21 లక్షలు మంజూరయ్యాయి. వీటికి మరమ్మతులు చేసిన తర్వాత గుత్తేదారుడు ఏడాది పాటు వాటి నిర్వహణ కూడా చూడాల్సి ఉంటుంది. దీని వలన తూతూ మంత్రంగా మరమ్మతులు చేసి గుత్తేదారుడు చేతులు దులుపుకోకుండా నాణ్యతగా పనులు చేయడానికి అవకాశం ఏర్పడనుంది. గ్రామీణ రహదారుల మరమ్మతులు(ఎంఆర్‌ఆర్) పథకం కింద పంచాయతీరాజ్‌శాఖ నుంచి జడ్పీ ఛైర్మన్ గద్దె అనూరాధ కృషితో ఈ నిధులు మంజూరయ్యాయని, మండలంలోని 8 బీటీ రహదారులకు మంజూరైన నిధుల వివరాలను జడ్పీ ఉపాధ్యక్షురాలు శాయన పుష్పావతి వెల్లడించారు.

✦ గాంధీ ఆశ్రమం-విన్నకోట ఆర్‌అండ్‌బీ రహదారిలో కుచికాయలపూడి నుంచి శేరికల్వపూడి వరకూ 3.97 కి.మీ మరమ్మతులకు ₹ 5.96 లక్షలు మంజూరయ్యాయి.

✦ ముదినేపల్లి నుంచి శేరిదగ్గుమిల్లి రహదారికి 2.05 కి.మీ మేర ₹ 3.08 లక్షలు.

✦ పెంజెంద్ర రహదారి నుంచి చిత్రం రహదారికి 2.60 కి.మీ మేర ₹ 3.90 లక్షలు.

✦ కట్టవానిచెర్వు నుంచి తాడిచర్ల రహదారికి 1.40 కి.మీ మేర ₹ 2.10 లక్షలు.

✦ కౌతవరం నుంచి చేవేంద్ర రహదారికి 4.8 కి.మీ మేర ₹ 7.20 లక్షలు.

✦ సింగరాయపాలెం రహదారి నుంచి చినగొన్నూరు రహదారికి 2.25 కి.మీ మే ₹ 3.38 లక్షలు.

✦ సింగలూరు అప్రోచ్ రహదారికి 2.40 కి.మీ మేర ₹ 3.60 లక్షల వంతున మొత్తం ₹ 29.21 లక్షలు మంజూరైనట్లు ఆమె వివరించారు.



అధ్వానంగా ఉన్న కౌతవరం-చేవేంద్ర రహదారి



గోతులమయంగా గాంధీ ఆశ్రమం-కూచికాయలపూడి మార్గం

ఆదివారం 16 జులై 2017

# పాఠశాలల అభ్యున్నతికి అందరి సహకారం అవసరం



తరగతి గదిని ప్రారంభిస్తున్న జడ్పీ ఉపాధ్యక్షురాలు పుష్పావతి, విజయభారతి, బాబూరావు తదితరులు

**కౌతవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే:** పాఠశాలల అభ్యున్నతికి సహకారం అవసరమని జడ్పీ ఉపాధ్యక్షురాలు శాయన పుష్పావతి పేర్కొన్నారు. మండలంలోని కౌతవరం జడ్పీ హైస్కూల్‌లో శనివారం ఓఎన్జీసీ సంస్థ రూ. 1.40 లక్షలతో అందజేసిన రాత బల్లలు, ఉపాధ్యాయుల కుర్చీలు, బీరువాలు, ఆర్వో వాటర్ పరికరాల ప్రారంభ కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలకు సామాజిక ప్రజాభాగస్వామ్యం ద్వారా కార్పొరేట్ సంస్థలు తమ వంతు సహకారం అందించడం అభినందనీయమన్నారు. ముఖ్యంగా ఓఎన్జీసీ సంస్థ పాఠశాలల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తోందని ప్రశంసించారు. ఈ సందర్భంగా తరగతి గదిలో ఏర్పాటు చేసిన రాతబల్లలను, కుర్చీలను, బీరువాలను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ కొసరాజు విజయభారతి, జిల్లా పాలసమితి డైరెక్టర్ వల్లభనేని బాబూరావు, సర్పంచి పడమట సుజాత, హెచ్ఎం విజయకుమారి, ఓఎన్‌జీసీ సంస్థ అధికారులు రత్నం, రాజేశ్, తెదేపా నేత శాయన సూర్యప్రసాదరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సోమవారం 17 జులై 2017

# అయ్యా... నేను బతికే ఉన్నా..

## పింఛను ఆగిపోవడంతో వృద్ధురాలి ఇక్కట్లు

**కౌతవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే:** నిరుపేద అయిన ఆ వృద్ధురాలి భర్త రోడ్డుప్రమాదంలో మృతి చెందారు. పదేళ్లు పోరాడితే ఆమెకు వితంతు పింఛను వచ్చింది.. దాంతో ఎలాగోలా జీవనం సాగిస్తోంది....హఠాత్తుగా మూడు నెలలుగా ఆమెకు వచ్చే వచ్చే పింఛను నిలిపివేశారు... అధికారులు చుట్టూ తిరిగితే చివరకు ఆమెకు చావు కబురు చల్లగా చెప్పారు... అదేంటంటే నీవు చచ్చిపోయావు కాబట్టి నీకు పింఛను రాదని... దీంతో ఆమె ఎవరికి చెప్పాలో అర్థం కాక ఆవేదన చెందుతోంది.



తన పింఛను పుస్తకంతో దీనంగా లక్ష్మీసౌభాగ్యం

మండలంలోని కౌతవరంలో ఇళ్ల వెంట తిరిగి చేకోడీలు అమ్ముకుని జీవించే బెజవాడ మురళీ గంగాధరరావు 1996లో స్థానికంగా జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. పదేళ్ల పాటు ఆయన భార్య లక్ష్మీసౌభాగ్యం కార్యాలయాలు, అధికార, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరిగితే 2006లో ప్రభుత్వం వితంతు పింఛను మంజూరు చేసింది. రోడ్డుపక్కన చిన్నబడ్డీకొట్టు నిర్వహించుకునే కుమారుడు శ్రీనివాసరావు వద్ద నివసిస్తోంది. వచ్చే పింఛనుతో కాలం వెళ్లదీస్తోంది. ఐతే హఠాత్తుగా ఆమెకు మూడు నెలల కిందట పింఛను నిలిచిపోయింది. తొలుత సాంకేతిక కారణాలన్నారు...తిరగ్గా తిరగ్గా ఆమెకు మండల, గ్రామాధికారులు నీవు చనిపోయినట్లు ఆన్‌లైన్ రికార్డుల్లో ఉందని చెప్పారు. మొత్తం వాకబు చేస్తే కౌతవరం శివారు పసుబొట్లపాలెంలో ఇదే ఇంటిపేరు ఉన్న ఓ మహిళ మృతి చెందితే ఆమె పేరు బదులు ఈమె చనిపోయినట్లు రికార్డుల్లోకెక్కించినట్లు భావిస్తున్నారు. పసుబొట్లపాలెం మహిళకు తర్వాత రెండు నెలల పాటు పింఛను నగదు కూడా వచ్చిందని, తర్వాత తీసుకోకపోవడంతో నిలిపివేశారని సమాచారం. ఎవరో చనిపోతే తాను మృతి చెందినట్లు అధికారులు ఇలా పింఛను నిలిపివేయడం అన్యాయమని, తనకు పింఛను మంజూరు చేయాలని ఆమె దీనంగా వేడుకుంటోంది.

# కౌతవరం లాకులకు వారాబంది అమలు



నీటి సరఫరా నిలిపివేయడంతో అడుగుభాగం కన్పిస్తున్న క్యాంప్‌బెల్ కాల్వ

**కౌతవరం(గుడ్లవల్లేరు):** తూర్పుకృష్ణాలో ప్రధానమైన కౌతవరం లాకుల వద్ద వారాబందీ(వంతులవారీ నీటి విడుదల) అమలు చేస్తున్నారు. దీని ప్రకారం మూడు రోజుల కిందట బంటుమిల్లి కాల్వకు నీటిని నిలిపివేసి క్యాంప్‌బెల్, పోల్‌రాజ్ కాల్వలకు నీటిని ఇచ్చారు. ఆదివారం మధ్యాహ్నం నుంచి బంటుమిల్లికి తిరిగి నీటి సరఫరా చేసి క్యాంప్‌బెల్ కాల్వకు నిలిపివేశారు. పోల్‌రాజ్ కాల్వకు యథావిధిగా నీరిస్తున్నారు. బంటుమిల్లి కాల్వకు 420, పోల్‌రాజ్ కాల్వకు 290 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు లాకు సూపరింటెండెంట్ ఉదయభాస్కర్ వెల్లడించారు.



పోల్‌రాజ్ కాల్వలో నీటి ప్రవాహం

గురువారం 20 జులై 2017

# దారులన్నీ గోతులవైపే

- భారీ వర్షాలకు దెబ్బతిన్న రహదారులు
- ఆదమరిస్తే ప్రమాదమే



కౌతవరం Iవవార్డు మలుపు వద్ద..



అంగలూరు వద్ద ..



నందివాడ-తమిరిశ ప్రధాన రహదారి దుస్థితి

**కౌతవరం (గుడ్లవల్లేరు), నందివాడ, న్యూస్‌టుడే :** గత రెండు, మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ప్రధాన రహదారులతో సహా రోడ్లన్నీ దారుణంగా దెబ్బతిన్నాయి. ఎక్కడికక్కడ గుంతలు, గోతులు పడి ప్రమాదకరంగా మారాయి. వాహనం నడిపితే ఆ లోతు గొయ్యిలో పడి నడుములు విరుగుతున్నాయని చోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలం మీదుగా వెళ్లే ప్రధాన రాష్ట్ర హదారి ఎంఎన్‌కే రహదారిలో వడ్లమన్నాడు నుంచి అంగలూరు వరకు అధ్వానంగా తయారై ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. తక్షణం వాటికి మరమ్మతులు చేయాలని కోరుతున్నారు. నందివాడ-తమిరిశ రహదారిపై ఏర్పడిన గోతుల్లో భారీగా నీరుచేరింది. అధికారులు వెంటనే రహదారుల మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## మూడు కాల్వలకు నీరు విడుదల పెంపు

**కౌతవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే** : తూర్పు కృష్ణాలో ప్రధానమైన కౌతవరం లాకులకు భారీగా వరద నీరు చేరింది. దీంతో లాకుల నుంచి మూడు ప్రధాన కాల్వలకు పెద్ద ఎత్తున నీటిని విడుదల చేశారు. గత ఐదేళ్లలో ఇదే అత్యధికం. గత మూడు రోజులుగా భారీ వర్షాలతో బ్యారేజి నుంచి, చుట్టు పక్కల కాల్వల నుంచి పుల్లేరుకు భారీగా నీరు చేరింది. కౌతవరం లాకులకు 2500 క్యూసెక్కుల నీరు వచ్చింది. బంటుమిల్లి కాల్వకు 707 క్యూసెక్కులు, పోల్‌రాజ్‌కు 565, క్యాంప్‌బెల్‌కు 450 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇప్పటి వరకు కౌతవరం లాకుల వద్ద వారాబందీ విధానం అమలు చేశారు. ప్రస్తుతం ఆ విధానాన్ని తీసేసి భారీగా నీటిని విడుదల చేస్తున్నారు. మరికొన్ని రోజుల పాటు ఈ పరిస్థితి ఉండవచ్చని లాకు సూపరింటెండెంట్ ఉదయభాస్కర్ తెలిపారు.

శుక్రవారం 21 జులై 2017

# డ్రోన్ కెమెరాలతో కాల్వల వీడియో చిత్రీకరణ

**కౌతవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే :** మండలంలోని కౌతవరం ప్రధాన లాకుల వద్ద నీటి సరఫరాను డ్రోన్ కెమెరాలతో గురువారం చిత్రీకరించారు. నీటిపారుదల శాఖమంత్రి దేవినేని ఉమా ఆదేశాలతో అధికారులు, నిపుణులు నీటి పంపిణీని చిత్రీకరించారు. పట్టిసీమ నుంచి గత నెలలో డెల్టాకు గోదావరి నీటి పంపిణీ చేపట్టారు. ఆ నీరు ఎక్కడి వరకు వెళ్లింది, ఏ ప్రాంతంలో నారు, నాట్లు జరుగుతున్నాయే వివరాలు ప్రభుత్వానికి తెలియడం లేదు. శివారు ప్రాంత ప్రజాప్రతినిధులు కొందరు తమకు నీరు రావడం లేదంటుండగా, ప్రతిపక్ష నేతలు పట్టిసీమ నీరు రాలేందంటూ విమర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలో మొత్తం కాల్వల నీటి ప్రవాహాలను చిత్రీకరణ చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి డోన్ కెమెరాలతో చిత్రీకరణ బుధవారం ప్రారంభించారు. బ్యారేజి నుంచి డెల్టాకు గోదావరి నీటిని తరలిస్తున్న బందరు, ఏలూరు, రైవస్(పుల్లేరు) కాల్వల్లో నీటి ప్రవాహనాలను, వాటి ఆధారంగా సాగవుతున్న చేలను, వరి నారు, నాట్లను చిత్రీకరణ చేశారు. గురువారం కోమటిగుంట, బలిపర్రు తదుపరి మండలంలోని కౌతవరం లాకుల వద్దకు డ్రోన్ కెమెరా నిపుణులు చేరుకున్నారు. ముదినేపల్లి ఇరిగేషన్ ఏఈఈ కేవీ.సత్యనారాయణరావు పర్యవేక్షణలో నిపుణుడు చరణ్ డ్రోన్ కెమెరాతో కౌతవరం లాకుల వద్దకు పుల్లేరు ద్వారా చేరుతున్న నీటి సరఫరాను, అక్కడ నుంచి క్యాంప్ బెల్, పోల్‌రాజ్ కాల్వల ద్వారా విడుదలవుతున్న నీటిని చిత్రీకరించారు. లాకుల వద్ద డ్రోన్‌ల ద్వారా కాల్వల చిత్రీకరణను స్థానికులు, ప్రయాణికులు ఆసక్తిగా గమనించారు.



డ్రోన్ కెమెరాతో నిపుణులు చరణ్, ఏఈఈ సత్యనారాయణ



కౌతవరం లాకుల వద్ద ఎగురుతున్న డ్రోన్ కెమెరా

మంగళవారం 25 జులై 2017

# సంఘమిత్ర ఆధ్వర్యంలో పుస్తకాల పంపిణీ

**కౌతవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే :** మండలంలోని కౌతవరం జడ్పీ హైస్కూల్‌లో సోమవారం విద్యార్థులకు సంఘమిత్ర ఆధ్వర్యంలో రాత పుస్తకాల పంపిణీ చేశారు. 1985-86 బ్యాచ్ విద్యార్థులు సంఘంగా సంఘమిత్రగా ఏర్పడి వీటిని నిర్వహించారు. హైస్కూల్‌లోని 9,10 తరగతి



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న సంఘ ప్రతినిధులు అలీం, భాను, శ్రీను తదితరులు

విద్యార్థులు 220 మందికి ₹ 23 వేల విలువైన రాత పుస్తకాలను ఎంపీపీ విజయభారతి, ఎంఈఓ శంకర్‌నాథ్, సర్పంచి సుజాతల చేతులు మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘమిత్ర ఉపాధ్యక్షుడు షేక్ అలీం, సభ్యులు పింగళి భాను విశ్వనాధ్, బెజవాడ శ్రీనివాసరావు, విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేత

కౌతవరం(గుడ్లవల్లేరు): స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో 9, 10వ తరగతుల విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. 1985–86కు చెందిన పూర్వవిద్యార్థులు సంఘమిత్ర అనే సంస్థ ద్వారా ఈ కార్యక్రమాన్ని సోమవారం చేపట్టారు. రూ.23వేల విలువైన పుస్తకాలను విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ విజయభారతి, ఎంఈవో శంకరనాథ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


స్టూడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్





# విద్యుత్తు వెలుగులు అరకొరే

☛ 15 మందికి ఆరుగురే సిబ్బందే దిక్కు ☛ ఇదీ గుడ్లవల్లేరు మండలంలో పరిస్థితి

కౌతవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే

**22** గ్రామపంచాయతీలు... 46 గ్రామాలు.. 52 వేల జనాభా.. 13 వేల విద్యుత్తు కనెక్షన్‌లు. కానీ విద్యుత్తు సరఫరా, మరమ్మతుల కోసం ఉన్న సిబ్బంది మాత్రం నామమాత్రం. సగానికి సగం మంది కూడా సిబ్బంది లేని వైనంతో మండల విద్యుత్తు వినియోగదారులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. విద్యుత్తు సరఫరా నిలిచిపోతే ఎప్పుడు వస్తుందో తెలియక అంధకారంలో ప్రజలు తల్లడిల్లుతున్నారు. 22 పంచాయతీలకు కనీసం సగం మంది కూడా సిబ్బంది లేరు. మొత్తం 15 మందికిగాను కేవలం ఆరుగురు మాత్రమే ఉన్నారంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. చివరకు సబ్‌స్టేషన్ ఏఈఈ కూడా లేరు. ఒక్కో పోస్టు 6 ఏళ్ల పాటు ఖాళీగా ఉందంటే అధికారుల పనితీరు ఎలా ఉందో తెలుస్తోంది. చివరకు మండల ప్రజలకు మాత్రం చీకట్లు తప్పడం లేదు.

తన స్వగ్రామమైన మండలంలోని కౌతవరంలో 1984లో విద్యుత్ రంగ ప్రముఖులు నార్ల తాతారావు విద్యుత్ సబ్‌స్టేషన్‌ను నిర్మించారు. మండలం మొత్తానికి ఇక్కడ నుంచే విద్యుత్తు సరఫరా, నియంత్రణ జరుగుతుంది. ఒక ఏఈఈ, ఒక సబ్‌ఇంజినీర్, ఇద్దరు లైన్ ఇన్‌స్పెక్టర్(ఎల్‌ఐ)లు, నలుగురు లైన్‌మెన్(ఎల్‌ఎం)లు, 11 మంది అసిస్టెంట్ లైన్‌మెన్(ఏఎల్‌ఎం)లు ఉండాలి. పరిస్థితిని పరిశీలిస్తే..



కౌతవరం విద్యుత్ సబ్‌స్టేషన్

✦ ఏఈఈ సురేశ్ జూన్ చివరి వారంలో బదిలీ అయ్యారు. ఇప్పటికీ భర్తీ చేయలేదు. ముదినేపల్లి ఏఈఈకి అదనపు బాధ్యతలు అప్పగించారు.

✦ సబ్ ఇంజినీర్, ఇద్దరు ఎల్‌ఐలు ఉన్నారు.

✦ నలుగురు లైన్‌మెన్‌లకుగాను గుడ్లవల్లేరు, అంగలూరుల్లో మాత్రమే వీరుండగా, కౌతవరం, డోకిపర్రులలో లేరు. ఇక్కడి ఇద్దరు ఎల్‌ఎంలు కొన్నేళ్లుగా గైర్హాజరే.

✦ 11 మంది ఏఎల్‌ఎంలకు కేవలం నలుగురు మాత్రమే ఉండగా, ఏడు చోట్ల ఖాళీలు ఉన్నాయి.

1. మేజర్ పంచాయతీ అయిన కౌతవరం(గ్రామం మొత్తం, గుడ్లవల్లేరు తర్వాత పెద్ద గ్రామమిది)లో రెండున్నరేళ్లుగా లేరు. ఉన్న ఎల్‌ఎం కూడా లేకపోవడంతో గుడ్లవల్లేరు నుంచి వచ్చి చూడాల్సిందే.

2. మేజర్ పంచాయతీ అయిన డోకిపర్రులో(డోకిపర్రు, లంకాదొడ్డి, తురాయిపాలెం, పొన్నగంటిగూడెం, కొత్తపేట, మీర్‌అలీపాలెం) 9 ఏళ్లుగా ఖాళీగానే ఉంది. ఎల్‌ఎం కూడా గైర్హాజరు కావడంతో సమస్య వస్తే పక్క సెక్షన్ నుంచి ఎవరో ఒకరు వచ్చి చూసేదాకా ఇక్కడి ప్రజలు అంధకారంలో మగ్గాల్సిందే.

3. వడ్లమన్నాడులో(వడ్లమన్నాడు, రెడ్డిపాలెం, గాదేపూడి, ఉలవలపూడి, మందవానిపాలెం, భీమునిగుంట, సత్యనారాయణపురం, కొండిపాలెం) ఆరేళ్లుగా ఖాళీగానే ఉంది. ఇన్ని గ్రామాల్లో ఎక్కడైనా ఇబ్బంది వస్తే వేమవరం నుంచి ఏఎల్‌ఎం రావాలి.

4. విన్నకోటలో(విన్నకోట, సుబ్బిచెర్వు, జేమ్స్‌పేట, కూరాడ) 2 ఏళ్లుగా ఖాళీగా ఉంది. పురిటిపాడు ఏఎల్‌ఎం వచ్చి చూస్తేనే వారికి విద్యుత్తు సరఫరా.

5. పెంజెంద్ర(పెంజెంద్ర, రేమల్లెగూడెం, చిత్రం, మామిడికోళ్ల) ఏడాదిగా ఖాళీనే. పక్క సెక్షన్లలో ఎవరు ఖాళీగా ఉంటే వారి దయతోనే ఈ గ్రామాల్లో మరమ్మతులు జరిగేది.



విద్యుత్‌లైన్లకు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

6. పోలిమెట్ల(పోలిమెట్ల, కుచికాయలపూడి, శేరికల్వపూడి)లో 5 ఏళ్లుగా ఖాళీనే. అంగలూరు ఏఎల్‌ఎం వచ్చి ఈ గ్రామాల్లో సమస్యను పరిష్కరించాల్సిందే.

7. పెసరమిల్లి(పెసరమిల్లి, పసుమొట్లపాలెం, వెణుతురుమిల్లి, దేశాయ్‌గుంట)లో 3 ఏళ్లుగా ఖాళీగా ఉంది. ఎవరో ఒకరు వచ్చి చూసే వరకు పరిస్థితి చీకటే.

దీనిపై ట్రాన్స్‌కో ఏడీఏ తులసీప్రసాద్‌ను వివరణ కోరగా ఇది ప్రభుత్వపరంగా నిర్ణయం తీసుకోవాల్సిన అంశమన్నారు. సిబ్బంది ఖాళీలు నిజమేనని, సాధ్యమైనంత వరకు ఎవరికీ ఇబ్బంది లేకుండా పక్కనున్న సిబ్బందిని పంపి గ్రామాల్లో వెలుగులు నింపుతునే ఉన్నామన్నారు.

శనివారం 29 జులై 2017

# గుడ్లవల్లేరుకు మహర్దశ

గుడ్లవల్లేరు మండలానికి మహర్దశ పట్టింది. మండలంలోని 20 గ్రామపంచాయతీల్లో ఒకేసారి 149 సిమెంట్ రోడ్లను నిర్మించనున్నారు. ఇందుకోసం ప్రభుత్వం ₹ 7.83 కోట్లను మంజూరు చేసింది. గ్రామ పంచాయతీ నిధులకు ఉపాధి హామీ పథకం నిధులు జత కలవడంతో ఇంత పెద్దఎత్తున సిమెంట్ రోడ్ల నిర్మాణాలకు అవకాశం ఏర్పడింది. దీంతో దాదాపుగా మండలంలో అంతర్గత రహదారులు మొత్తం అభివృద్ధి చెంది సిమెంట్ రోడ్లుగా మారనున్నాయి.

**20 గ్రామాల్లో 149 సిమెంట్ రోడ్లు**

**₹ 7.83 కోట్లు మంజూరు**

<u>గుడ్లవల్లేరు, న్యూస్‌టుడే</u>

ఈ ఏడాది గ్రామపంచాయతీలకు విడుదలైన 14వ ఆర్థిక సంఘం నిధులకు కేంద్రప్రభుత్వం ఉపాధి హామీ నిధులను కలుపుతూ గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలని ఆదేశించింది. రెండు వేల లోపు జనాభా ఉన్న పంచాయతీల్లో 10 శాతం పంచాయతీ నిధులు వెచ్చిస్తే మిగిలిన 90 శాతం నిధులను ఉపాధి ద్వారా సమకూరుస్తారు. అలాగే 5 వేలలోపు జనాభా ఉన్న పంచాయతీల్లో 30 శాతం పంచాయతీ నిధులు వెచ్చిస్తే మిగిలిన 70 శాతం నిధులను ఉపాధి ద్వారా సమకూరుస్తారు. 5 వేలకు పైగా జనాభా ఉన్న పంచాయతీలు 50 శాతం పంచాయతీ నిధులకు 50 శాతం ఉపాధి నిధులను కేంద్రం భరించనుంది. ఈ ప్రాతిపదికన చిన్న పంచాయతీలకు అధిక మేలు జరగనుంది. ఈ క్రమంలో గుడ్లవల్లేరు మండలంలోని 20 గ్రామపంచాయతీల్లో ₹ 7.83 కోట్ల పంచాయతీ, ఉపాధి నిధుల సంయుక్తంతో 149 సిమెంట్ రోడ్లను నిర్మించనున్నారు. వాటి వివరాలను జడ్పీ ఉపాధ్యక్షురాలు శాయన పుష్పావతి ఇలా వెల్లడించారు. ❖ గుడ్లవల్లేరులో 23 రహదారులకు 88.22 లక్షలు, ❖ కౌతవరంలో 12 మార్గాలకు ₹ 35.30 లక్షలు, ❖ డోకిపర్రులో 9 రోడ్లు ₹ 33.20 లక్షలు ❖ కూరాడలో 8 రహదారులు ₹ 56.20 లక్షలు ❖ వడ్లమన్నాడులో 12 రోడ్లు... ₹ 43.40 లక్షలు ❖ శేరికల్వపూడిలో ఏడింటికి ₹ 35 లక్షలు ❖ చంద్రాలలో ఆరు మార్గాలకు ₹34.80 లక్షలు ❖ వెణుతురుమిల్లిలో ఐదింటికి ₹ 32 లక్షలు ❖ పోలిమెట్లలో ఏడు రోడ్లకు ₹ 28.20 లక్షలు ❖ కుచికాయలపూడిలో పదింటికి ₹39.10 లక్షలు ❖ మామిడికోళ్లలో మూడు రోడ్లకు ₹17.60 లక్షలు ❖ శేరిదగ్గుమిల్లిలో తొమ్మిది రోడ్లు... ₹ 63.40 లక్షలు ❖ కట్టువానిచెర్వులో ఏడు మార్గాలకు ₹ 35 లక్షలు ❖ పురిటిపాడులో 6 రోడ్లు... ₹30 లక్షలు ❖ గాదేపూడిలో 3 రోడ్లు.... ₹ 17.30 లక్షలు ❖ ఉలవలపూడిలో 4 రోడ్లు... ₹ 13.80 లక్షలు ❖ చిత్రంలో 3 రోడ్లు.. ₹ 7.80 లక్షలు ❖ పెంజెంద్రలో మూడు రోడ్లకు ₹ 21.50 లక్షలు ❖ వేమవరంలో నాలుగు మార్గాలకు ₹ 25.80 లక్షలు ❖ చినగొన్నూరులో 8 రోడ్లు.. . ₹ 71.10 లక్షలు మంజూరైనట్లు తెలిపారు.



పెంజెంద్ర ఎస్సీవాడ రహదారి దుస్థితి ఇది...